నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 10 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఉద్యోగులకు బదిలీలు సహజమే

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

రెబ్బెన, ఆగస్టు 9 : ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జీఎంగా విధులు నిర్వహించి కార్పొరేట్ మార్కెటింగ్ జీఎంగా బదిలీ అయిన రవిప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ యువ నాయకుడు కోవ సాయినాథ్, బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్ అధికారి నవనీత, మేనేజర్ మహేశ్ ఉన్నారు.



బదిలీ అయిన బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

## భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

- ఆలయాల్లో మహిళల సందడి
- పుట్టల వద్ద ప్రత్యేక పూజలు

నమస్తే నెట్ వర్క్ : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయమే ఆలయాలకు చేరుకొని నాగదేవతకు పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి పట్టు వస్త్రాలతో నైవేద్యాలు సమర్పించారు. అగరొత్తులు వెలిగించి.. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.



మంచిర్యాల ఏసీసీ : హమాలీవాడలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

## కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకం

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 9 : నిందితులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమైనదని, నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని రామగుండము పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ కోర్టు డ్యూటీ, కోర్టు లైసెన్ ఆఫీసర్స్‌తో సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ కోర్టు కానిస్టేబుళ్లు కోర్టు క్యాలెండర్ తయారు చేసుకోవాలని, నిందితులకు శిక్షలు పడేలా సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ (ఫైల్)

## కష్టం ఒకరిదైతే.. పేరొకరికా..!

- నాడు బాల్క సుమన్ చొరవతో పీహెచ్‌సీ భవనానికి నిధులు
- నేడు చేసిందేమీ లేకపోయినా ప్రారంభించి గొప్పలు

చెన్నూర్, ఆగస్టు 9 : బీఆర్ఎస్ సర్కారులో అప్పటి విప్ బాల్క సుమన్ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగానే జైపూర్ మండలం కుందారంలోని పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులివ్వాలని 2022 మార్చి12న అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుకు విజ్ఞప్తి చేశారు. దీంతో రూ. 1.56 కోట్లు మంజూరు చేయగా, 2023 జనవరి 9న బాల్క సుమన్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తికావడంతో ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణానికి నాడు సుమన్ తీవ్రంగా కష్టపడితే.. నేడు ఎమ్మెల్యే వివేక్ ఎలాంటి కృషి చేయకుండానే ప్రారంభోత్సవం చేసి గొప్పలు చెప్పుకోవడం కొసమెరుపు. కష్టం ఒకరిదైతే.. గొప్పతనమంతా తమదే అన్నట్లు కాంగ్రెసోళ్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు మాట్లాడుకకుటున్నారు.



నిధులు మంజూరు చేయాలని అప్పటి మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

# ఇసుక దందాలో హస్తం

**కోటపల్లి మండలంలోని గోదావరి నుంచి జోరుగా రవాణా**

- సాండ్ మాఫియా వెనుక కాంగ్రెస్ లీడర్లు ● నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే చేస్తున్నారంటూ ప్రచారం
- ఆ లెక్కన మరి ఇప్పుడున్న ఎమ్మెల్యే పాత్ర లేదా ! ● కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న కిందిస్థాయి అధికారులు
- పటిష్టమైన నిఘా పెడితే మరి ఎందుకు అడ్డుకోలేక పోతున్నారంటూ ఆరోపణలు
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న క్వారీలు ● కోట్లకు పడగెత్తిన ఓ మాజీ సర్పంచే కీలక సూత్రధారి

మంచిర్యాల, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి మండలంలోని గోదావరి నది నుంచి ఇసుక దందా జోరుగా సాగుతున్నది. అధికార పార్టీ నాయకుల జోక్యంతో ఈ వ్యవహారం మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతున్నది. గోదావరి నదిపై ప్రభుత్వం మూడు ఇసుక క్వారీలను ఏర్పాటు చేసింది. ఈ క్వారీల నుంచి ఇసుకను అక్రమంగా లారీల్లో హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్క పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలివెళ్తుందని తెలిసి పలువురు కాంగ్రెస్ నాయకులు క్వారీల యజమానులను డబ్బులు డిమాండ్ చేసినట్లు గతంలో ఫిర్యాదులు వచ్చిన విషయం విదితమే. కొందరు కాంగ్రెస్ లీడర్లైతే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఎమ్మెల్యే వివేక్‌కు ఫిర్యాదు చేసే వరకు వెళ్లారు. కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ దందా చేస్తుండగా, పార్టీకి చెడ్డపేరు వస్తుందని ఎమ్మెల్యే వివేక్ ఇసుక క్వారీల్లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఆదేశించారు. దీంతో కలెక్టర్ గోదావరి నదిపై ఉన్న ఇసుక క్వారీలను పలు మార్లు సందర్శించారు. క్వారీల నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రవాణా చేయాలని మైనింగ్ ఏడీ జగన్మోహన్, టీజీఎండీసీ పీవో తారక్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. జూలై 12న ఇసుక క్వారీలను సందర్శించిన సదరు అధికారులు అక్రమ క్వారీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, జీరోగా ఇసుక తరలించకుండా, ఓవర్‌లోడ్‌తో ఇసుక వెళ్లకుండా తనిఖీలు చేస్తామన్నారు. రోజూ సుమారు 270 లారీల ఇసుక పర్మిట్లతో వెళ్తుందని వెల్లడించారు.

### అధికారులు చెప్పినవన్నీ అబద్ధాలేనా..

ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. రెండు రోజుల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలు పట్టుబడుతున్నాయి. అధికారులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తే అక్రమ రవాణా ఎందుకు జరుగుతుందనేది అర్థం కావడం లేదు. దీంతో అధికారులు చెప్పినవన్నీ అబద్ధాలేనా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. రెండు రోజుల క్రితం.. ఆగస్టు 7న రాత్రి ఎలాంటి పర్మిట్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. అలాగే శుక్రవారం (9వ తేదీ) నాడు ఏకంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఐదు లారీలను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు అప్పుడప్పుడూ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తే అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు పట్టుబడుతున్నాయి. అదే ఇసుక అక్రమ రవాణా జరగకుండా క్వారీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన మైనింగ్ శాఖ, టీజీఎండీసీ అధికారులకు మాత్రం ఈ లారీలు పట్టుపడడం లేదు. ఈ లెక్కన ఆయా శాఖల అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారని స్పష్టం అవుతున్నది.



పరిమితికి మించి ఇసుక తరలిస్తూ పట్టుబడ్డ లారీలు

### చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

క్వారీల నుంచి ఇసుక రవాణాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను మైనింగ్ ఏడీతో పాటు టీజీఎండీసీ పీవో పర్యవేక్షించాలి. వీరు తమ సిబ్బందిని క్వారీల వద్ద ఉంచి ముందుగా చలాన్ కట్టిన లారీలకు ఎన్ని టన్నుల వరకు పర్మిషన్ ఉందో చూడాలి. తూకం వేసి ఓవర్ లోడ్ లేదని నిర్ధారించుకున్నాకే లారీలకు పంపించాలి. కానీ ఇది ఎక్కడా జరగడం లేదు. క్వారీ నిర్వాహకులు, సంబంధిత అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. రోజూ వందల లారీలు జీరో బిల్లులు, ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయి. ఈ వ్యవహారంలో రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తున్నది. నిబంధనల ప్రకారమైతే క్వారీల దగ్గరే వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసి తూకం వేయాలి కానీ.. అందుకు విరుద్ధంగా లారీలను బయటి వే బ్రిడ్జిలకు తీసుకువచ్చి తూకం వేస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే క్వారీల్లోనే అక్రమంగా ఇసుక నింపుతూ పట్టుబడితే అట్టి క్వారీలను సీజ్ చేసి, అనుమతులను రద్దు చేయాల్సి ఉంటుంది. దీంతో అధికారులు లారీలను రోడ్డుపై పట్టుకున్నట్లు, ఎక్కడో అక్రమంగా ఇసుకను నింపుకున్నట్లు కేసులు నమోదు చేసి క్వారీ నిర్వాహకులను కాపాడుతున్నారు. ఒకవేళ కింది స్థాయి సిబ్బంది క్వారీల్లో అక్రమంగా నింపుతున్న లారీలను పట్టుకుంటే ఈ విషయం ఎక్కడ చెప్ప వద్దని ఉన్నతాధికారుల నుంచే ఆదేశాలు వస్తున్నాయంటే ఈ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

### అక్రమ రవాణాకు మార్గాలెన్నో..

క్వారీల నుంచి పలు రకాలుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. చలాన్ కట్టి పర్మిట్ ఉన్నప్పటికీ, పర్మిషన్ ఉన్న క్వాంటిటీ కంటే ఎక్కువ తూకం వేస్తున్నారు. చలాన్ ప్రకారం తీసుకెళ్లాల్సిన క్వాంటిటీ కంటే జేసీబీతో అదనంగా రెండు బకెట్లు నుంచి మూడు బకెట్లు నింపుతున్నారు. దీంతో ప్రతి లారీలో ఐదు టన్నుల నుంచి ఎనిమిది టన్నుల వరకు అదనంగా ఇసుక తీసుకెళ్తున్నారు. దీనికి క్వారీ నిర్వాహకులు లారీ యాజమానుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇది ఒకరకమైతే ఎలాంటి బిల్లులు కట్టకుండానే లారీల్లో ఇసుక నింపి తరలించడం మరో రకం. వార్తలు వచ్చినప్పుడో, ఫిర్యాదులు వచ్చినప్పుడో తప్పనిసరి పరిస్థితుల్లో క్వారీల్లో చలాన్ లేకుండా అక్రమంగా ఇసుకను నింపుతున్న లారీలను పట్టుకుంటున్నారు.

### దందాలో ఉన్నవారంతా అధికార పార్టీవాళ్లే

ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అక్రమ ఇసుక దందా చేస్తున్నారంటూ ఇప్పుడున్న ఎమ్మెల్యే వివేక్ ఆరోపించారు. ఆ లెక్కన ఇప్పుడు జరుగుతున్న ఇసుక అక్రమ దందా వెనుక సైతం ఎమ్మెల్యే ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ దందాలో మొత్తం అధికార పార్టీ నాయకులే ఉండడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. కోటపల్లి మండలంలో రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఓ ఇసుక క్వారీతో ఇప్పుడున్న మూడు క్వారీలకు సమీప గ్రామంలో ఉండే మాజీ సర్పంచ్(కాంగ్రెస్ పార్టీ లీడర్) పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం ఏకంగా 15 లారీలను కొనుగోలు చేశాడని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇతడు క్వారీల సమీప గ్రామానికి మాజీ ప్రజాప్రతినిధి కావడం, క్వారీల నిర్వాహకులతో సన్నిహిత సంబంధాలు ఉండడం.. కొన్ని క్వారీల్లో భాగస్వామ్యం కూడా ఉండడం కలిసి వస్తున్నది. సొంత లారీల్లో పగలూ రాత్రీ తేడా లేకుండా క్వారీల నుంచే నేరుగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్లకు పడగలెత్తినట్లు ఆరోపణలు ఉన్నాయి. సినీ ఫక్కీలో ముందు ఒక వాహనం పైలెట్‌గా వెళ్తూ.. ఇసుక లారీలు వెనకాల వచ్చేలా ఏర్పాట్లు చేసుకొని అక్రమ రవాణా చేస్తారని తెలుస్తుంది. ఆయన వాహనం ముందుగా వస్తుందంటే మామూళ్లు తీసుకునే అధికారులకు ముందే తెలిసిపోతుంది. దీంతో అతని లారీలను ఎలాంటి తనిఖీలు చేయకుండానే వదిలేస్తారని ఆరోపణలున్నాయి. ఇక ఇదే మండలం పారుపల్లి గ్రామంలో ఇసుక తరలించే లారీలను ఆపి మరీ అధికార పార్టీకి చెందిన కొందరు లీడర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో గుడి నిర్మాణం పేరుతో రోజుకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన మరో వర్గం కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారు. ఒక్క కోటపల్లి అనే కాదు చెన్నూర్ రూరల్, జైపూర్, భీమారం మండలాల్లోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎక్కడ ఇసుక అక్రమ రవాణా జరిగినా దాని వెనుక కాంగ్రెస్ లీడర్లే ఉంటున్నారు. మరి ఇప్పటికైనా అధికార పార్టీ, అధికారులు సీరియస్‌గా తీసుకొని అక్రమ రవాణాను అడ్డుకుంటారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.



అక్రమంగా ఇసుక తరలిస్తూ రెండు రోజుల క్రితం పట్టుబడ్డ లారీ



కుమ్రం భీం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి





జిల్లా కేంద్రంలో ఆదివాసులతో కలిసి ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరులు

## గిరిజనుల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● ఆసిఫాబాద్‌లో అధికారికంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు ● ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 9 : గిరిజనుల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి హాజరై జెండాల వద్ద పూజలు నిర్వహించారు. కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ యువత చదువుల్లో రాణించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని పిలుపునిచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ నాయకులు వివిధ సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గిరిజన సంఘాల నాయకులు బుర్స పోచయ్య, కుర్సింగ మోతీరామ్, సిడాం అర్జు, సుంకె కిష్టయ్య, బొమ్మెన దశరథ్, పెందూర్ సుధాకర్, ఆత్రం భీమ్ రావు, మడావి గుణవంతరావు, మర్సుకోల తిరుపతి, నాంపల్లి శంకర్ పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ



ఆరు ఉద్యోగాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ కూతురు నికితను సన్మానిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

## కృషి, పట్టుదల ఉంటే విజయాలు సాధ్యం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ● ఆరు ఉద్యోగాలు సాధించిన నికితకు సన్మానం

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 9 : కృషి, పట్టుదల, అంకితభావముంటే విజయాలు సాధ్యమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ సర్దార్ సింగ్ కూతురు నికితను ఎస్పీ శాలువాతో సత్కరించారు. నికిత ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో యూపీఎస్సీ, గ్రూప్-1 లాంటి పరీక్షల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, సర్దార్ సింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## పులికోసం అన్వేషణ

- కెరమెరి అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు అనుమానిస్తున్న అధికారులు
- అడుగులు గుర్తించేందుకు యత్నం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రం సమీప అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి కోసం అధికారులు అన్వేషణ ప్రారంభించారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో కొద్ది రోజుల క్రితం సంచరించిన పులి, నాలుగు రోజుల క్రితం ఆసిఫాబాద్ మండలం గుండి, గోవిందాపూర్ అటవీ ప్రాంతంలో పర్యటించింది. రైతుల సమాచారం మేరకు అటవీ అధికారులు పులి అడుగులను గుర్తించారు. మరుసటి రోజు తిర్యాణి అడవిలో పర్యటించిన పులి చిర్రకుంట సమీపంలో ఓ ఆవుపై దాడి చేసింది. తాజాగా.. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న కొమ్ముగూడ అటవీ ప్రాంతంలోని అడవిలో పశువులను మేపుతున్న కాపరి భీంరావుపై దాడికి యత్నించింది. పులి ఒక్కసారి పశువుల మందపై దాడిచేయడంతో భయంతో పశువులు చెల్లాచెదురు కాగా, పశువుల కాపరులు సైతం పరుగులు పెట్టారు. ఒక పశువుని పులి గాయపరిచిందని కాపరి భీంరావు తెలిపారు. శుక్రవారం అటవీ అధికారులు పులి ఆచూకీ కోసం రంగంలోకి దిగారు. జిల్లా కేందానికి ఆనుకొని ఉన్న అడవులతోపాటు కెరమెరి, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ఇది ఎస్-12 పులి యేనా.. లేద కొత్తది వచ్చిందా అనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. పులి కాలిగుర్తుల ఆధారంగా కెరమెరి, ఆసిఫాబాద్ అడవుల్లో సంచరిస్తున్న పులి ఏదనేది స్పష్టత రానుంది. ఆరునెలలుగా జిల్లాలోపులి సంచారం మళ్లీ మొదలవడంతో అటవీ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు కనిపిస్తున్నాయి. పులి కోసం అడవుల్లో పర్యటిస్తున్నామని ఎఫ్ఆర్వో మజారొద్దీన్ తెలిపారు.



కెరమెరి అడవుల్లో పులి జాడ కోసం అన్వేషిస్తున్న అటవీ సిబ్బంది


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679